క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ ఫైర్ స్టేషన్, విక్టరీ ప్లే గ్రౌండ్, పుత్లీబౌలీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. గౌలిగూడ గురుద్వారా, రామ్ మందిర్, రాకేష్ పీటీ, అమృత్ బార్, పత్తర్ మజీద్, పుత్లీబౌలి చౌరస్తా, రామ్‌బాగ్ సమాజ్, సాయిబాబా ఆలయం ఎదురుగా, ఫ్యామిలీ క్వార్టర్స్, క్రాంతి పార్క్, బసేరా హోటల్, రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం, బడేమియా పెట్రోల్ పంప్, సీబీఎస్, వివి కన్యా పాఠశాల తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే 11 కే.వి జాంబాగ్, రామకృష్ణ థియేటర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వసంత్ విహార్, సెంట్రల్ బ్యాంక్, మయూరి హోటల్, మహారాష్ట్ర బ్యాంక్, వీవీ ఫంక్షన్‌హాల్, కోటక్ బ్యాంక్, సుప్రభాత్ హోటల్, ట్రూప్ బజార్, రామకృష్ణ థియేటర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలి



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న వెంకటయ్య

నాంపల్లి: వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటయ్య గురువారం రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి శాయా శక్తుల కృషి చేస్తానని, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు సత్కరించారు.

బస్సును జాగ్రత్తగా నడపాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఆర్ఎం రాజు

అఫ్జల్‌గంజ్: బస్సు నడిపే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని టీఎస్ ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ డిప్యూటీ ఆర్ఎం బీ. రాజు అన్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ డిపో–1లో డ్రైవర్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరిస్తూ, జాగ్రత్తగా బస్సును నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ బీ. కృష్ణారెడ్డి, అధికారులు హెచ్. వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, సీ. వెంకట్‌రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

కుంకుమార్చన.. కల్యాణోత్సవం

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని రంగనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చన, అభిషేకం ,బాలభోగం, బలిహరణ, ఆరాధన, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పల్లకిసేవను భక్తుల జయజయధ్వానాల మధ్య నిర్వహించారు. అనంతరం గరుడ వాహన సేవ నిర్వహించారు.

రంగనాథస్వామి కల్యాణం

రంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి ప్రధాన ఘట్టంగా కల్యాణోత్సవాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా నిర్మించిన కళ్యాణ కట్టపై రంగనాథుడు, మహలక్ష్మీ కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'మనూ'లో సింపోజియం

రాయదుర్గం: మేధోపరమైన వైకల్యం ఉన్న పిల్లల పాఠ్యాంశాల అవసరాలపై గురువారం మనూలో సింపోజియం నిర్వహించింది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ నిధులతో 'అడాప్టివ్' అనే ప్రాజెక్టు కింద 'మేధోపరమైన వైకల్యం ఉన్న పిల్లల పాఠ్య ప్రణాళిక అవసరాలు' అనే అంశంపై ఒక్కరోజు సింపోజియంను నిర్వహించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్, ప్రాజెక్టు చీఫ్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ సింపోజియంకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎన్ఐఈపీఐడీ మాజీ హెచ్ఓడీ విఆర్ పిషీలాజా, ఐజీఎస్ ఓయూ ప్రొఫెసర్ అమితవ్ మిశ్రా, ఎన్ఐఈపీఎండీ డాక్టర్ కామరాజ్, సహ పరిశోధకుడు ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

కేసీఆర్ సేవాదళం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో హోంమంత్రి మహమూద్ అలీ, చిత్రంలో అమేర్ అలీ, మహ్మద్ జావీద్ పటేల్

నాంపల్లి: కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో డే అండ్ నైట్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 200 జట్లు హాజరయ్యే ఈ పోటీలు ఫిబ్రవరి 16వ తేదీ వరకు జరుగుతాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం లాల్‌బహదూర్ శాస్త్రి స్టేడియంలో ప్రారంభమైన టోర్నమెంట్‌కు రాష్ట్ర హోంశాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ అమేర్ అలీ, నీటి పారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి, స్పోర్ట్స్ చైర్మన్ ఆంజనేయ గౌడ్, బీఆర్ఎస్ నేత, కేసీఆర్ సేవాదళం సామాజిక మాధ్యమాల విభాగం కన్వీనర్ మహ్మద్ జావీద్ పటేల్‌తో కలిసి మంత్రి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మూడేళ్లుగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు అమేర్ అలీ వెల్లడించారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి, క్రీడల పట్ల ఆసక్తిని పెంచడానికి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసీఆర్ సేవాదళం ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, నేతలు దిలీప్ మసూద్, ఖలీమ్, ఉపేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది రోజుల్లో ఉచితంగా 38 ప్లాస్టిక్ సర్జరీలు



ప్లాస్టిక్ సర్జరీల వివరాలు వెల్లడించిన డీసీపీ పరవస్తు మధుకర్ స్వామి

అబిడ్స్: పది రోజుల్లో 38 ప్లాస్టిక్ సర్జరీలు ఉచితంగా నిర్వహించామని రాచకొండ డీసీపీ పరవస్తు మధుకర్‌స్వామి వెల్లడించారు. సీతారామ్‌బాగ్‌లోని ఈశ్వర్ చంద్ర హెల్త్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎంతో ఖరీదైన ప్లాస్టిక్ సర్జరీలు పరవస్తు క్రియేటీవ్ ఫౌండేషన్ లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, గ్రీన్‌ల్యాండ్స్‌ల ఆధ్వర్యంలో 10 రోజుల పాటు ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్‌ను నిర్వహించామన్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఉచితంగా సర్జరీలు చేసి మందులు కూడా పంపిణీ చేశామన్నారు. గ్రహణమొర్రితో బాధపడేవారికి ఉచితంగా సర్జరీలు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఈ ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు డీసీపీ మధుకర్‌స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ గులాబ్‌రాణి, విద్యాభూషణ్, డాక్టర్ లక్ష్మీకుమారి, రామమూర్తి, నిహారి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంపులో సేవలందించిన డాక్టర్లు, నర్సులు, వార్డుబాయ్‌లు, హెల్పర్లందరికీ ప్రశంస పత్రాలు అందజేశారు.

'కంటి వెలుగు' కేంద్రాల పనితీరు భేష్



కంటి వెలుగు కేంద్రంలో బీజేపీ నాయకులు

గోల్కొండ: కంటి వెలుగు కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది పనితీరు ఎంతో బాగుందని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. గురువారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి గుడిమల్కాపూర్‌లోని కంటివెలుగు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆహార నియమాలు మారడంతో పాటు ప్రజల జీవన శైలీ కూడా మారుతుందని, దీని వల్ల కంటి జబ్బులు పెరుగుతున్నాయన్నారు. గుడిమల్కాపూర్ డివిజన్‌లో పేదల బస్తీలు ఎన్నో ఉన్నాయని, కంటి పరీక్షల కోసం వచ్చేవారికి అన్ని రకాల కంటి పరీక్షలు చేయించి వారికి కంటి అద్దాలు సైతం అందజేయాలని ఆయన కోరారు. బీజేపీ నాయకులు అశ్విన్ మోదీ, పవన్ సింగ్ తదితరులు ఉన్నారు.

రేపు నెక్లెస్ రోడ్డులో 5కే రన్



మాట్లాడుతున్న మహాశృంగదాస తదితరులు

సుల్తాన్‌బజార్: కేన్సర్ మహమ్మారిపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈనెల 4న నెక్లెస్ రోడ్డులో 5కే రన్ నిర్వహిస్తున్నట్లు కూకట్‌పల్లి ఇస్కాన్ సంస్థ అధ్యక్షుడు మహాశృంగదాస అన్నారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేన్సర్ వ్యాధిని ఆరంభంలోనే గుర్తిస్తే చికిత్స అందించడం సులభతరం అవుతుందని, తద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. మారుతున్న జీవన విధానం, ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పుల వల్ల అనేక రోగాలు సంక్రమిస్తున్నాయని, వాటిలో కేన్సర్ ఒకటని సరైన అవగాహన లేకపోవడంతో కేన్సర్ రోగుల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ల్యాండ్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, రచయిత డాక్టర్ సహదేవ్‌దాస హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు రోమా, సుహాసిని, ఉత్తమ్ ప్రభు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ తదితరులు

అబిడ్స్: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిల్ షరీఫ్ పేర్కొన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఎంఎస్ఎంయూ, ఐఎన్‌టీయూసీ నాయకులతో కలిసి మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఉద్యోగులకు నగర శివారు ప్రాంతాల్లో నివాసాలను కట్టుకునేందుకు గాను స్థలాలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఉద్యోగులకు హెల్త్ కార్డులను జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు ఆర్‌డీ చంద్రశేఖర్, జనక్ ప్రసాద్, నాగన్న గౌడ్, భాస్కర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, విజయ్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

చార్మినార్: సిటీ కాలేజీ లియో క్లబ్, చార్మినార్ లయన్స్ క్లబ్ సెంటినియల్ సౌజన్యంతో గోషామహల్, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి, ఎంజీబీఎస్ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నిరాశ్రయులైన పేదలకు గురువారం దుప్పట్లను పంపిణీ చేశారు. సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్ దుప్పట్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తూ విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవ కూడా నేర్చుకున్నప్పుడే పేదరిక రహిత సమాజాన్ని చూడగలమన్నారు. సిటీ కాలేజీలో పని చేసే నిరుపేద మహిళా వర్కర్లకు కూడా దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిటీ కాలేజీ లియో క్లబ్ ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎల్. తిరుపతి, చార్మినార్ లయన్స్ క్లబ్ కోశాధికారి లయన్ సయ్యద్ అన్వర్, లియో క్లబ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ రామవంత్ చంటి, రాకేశ్, చతుర్వేద్, నరేశ్, జైపాల్, గణేష్ పాల్గొన్నారు.



దుప్పట్లను పంపిణీ చేస్తున్న సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్

దక్షిణ మండలం ట్రాఫిక్ నూతన ఏసీపీగా శ్రీనివాస్‌రావు



శ్రీనివాస్‌రెడ్డిని నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్ రావు

చార్మినార్: దక్షిణ మండలం ట్రాఫిక్ నూతన ఏసీపీగా కె.శ్రీనివాస్‌రావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏసీపీగా విధి నిర్వహణ కొనసాగించిన శ్రీనివాస్‌రెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో శ్రీనివాస్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు శ్రీనివాస్‌రెడ్డి వద్ద నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. దక్షిణ మండలంలోని చార్మినార్, మీర్‌చౌక్, బహదూర్‌పురా, ఫలక్‌నుమా తదితర ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలుగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఏసీపీలకు శుభాకాంక్షలు



శ్రీనివాస్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు

చార్మినార్: దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రావును పాతబస్తీలోని ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవి, మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్, ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఎం.రవి, బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ తదితరులు గురువారం సాయంత్రం చార్మినార్‌లోని ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయం వద్దకు చేరుకొని నూతన ఏసీపీ శ్రీనివాస్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్‌కు..



శుభాకాంక్షలు తెలుపుతున్న భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అంజద్ అలీ

గౌలిపురా: సంతోష్‌నగర్ డివిజన్ నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ గౌస్‌ను గురువారం భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అంజద్ అలీ ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏసీపీగా పని చేసిన వి.శ్రీనివాస్‌రెడ్డి డీజీపీ కార్యాలయానికి బదిలీ కాగా... ఆయన స్థానంలో ఇంటెలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా పని చేస్తున్న మహ్మద్ గౌస్ సంతోష్‌నగర్ ఏసీపీగా బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

మీర్‌చౌక్ ఏసీపీ దామోదర్‌కు..



శుభాకాంక్షలు తెలుపుతున్న డబీర్‌పురా ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్‌రావు, మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్

డబీర్‌పురా: మీర్‌చౌక్ డివిజన్ నూతన ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన దామోదర్‌రెడ్డిని గురువారం డబీర్‌పురా ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ రావు, మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్‌లతో పాటు ఎస్సైలు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. పాతబస్తీలో శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.


సుభాన్‌పురాలో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తాం



మంత్రి తలసానితో సమావేశమైన బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్, బస్తీవాసులు

అబిడ్స్: సుభాన్‌పురాలో నూతనంగా నిర్మించిన బస్తీ దవాఖానాను త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో బస్తీవాసులు మంత్రిని కలిసి వెంటనే బస్తీ దవాఖానా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఉన్నప్పటికీ బస్తీ దవాఖానాను వెంటనే ప్రారంభిస్తామని చెప్పారు. ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. మంత్రి సహకారంతో బస్తీవాసుల చిరకాల స్వప్నం నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అహ్మద్, మహ్మద్ గౌస్, మహ్మద్ అలీం, సాజీద్ అన్సారీ, సయ్యద్ యూసుఫ్, మహ్మద్ ఖాజా, యూసుఫ్ పటేల్, నిజాంసాబ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు.. పరుగు



జియాగూడ రంగనాథ ఆలయం వద్ద పారుతున్న డ్రైనేజీ మురుగు నీరు

జియాగూడ: సబ్జిమండి గుర్రం బావి చౌరస్తా నుంచి పారుతున్న మురుగునీరుతో ఆలయాలకు వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి ఈ మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారు. దీంతో రోడ్డుపై పారుతున్న మురుగు కారణంగా పాదచారులు, వాహనదారులు, ఆలయాలకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు పారుతున్న రహదారిలోని జియాగూడ రంగనాథస్వామి ఆలయం, కంచికామాక్షి ఆలయం , ప్రైవేటు పాఠశాల, భగత్‌సింగ్ చౌరస్తా ఉంది. శాశ్వత పరిష్కారం చేపడుతామని జియాగూడ రంగనాథ వైకుంఠోత్సవాలకు హాజరైన మంత్రి తలసాని హామీ అటకెక్కింది. జియాగూడ కార్పొరేటర్, కార్వాన్ ఎమ్మెల్యే ఈ ప్రాంతాన్ని సందర్శించి చర్యలు తీసుకోవాల్సింది పోయి కుంటిసాకులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: హకీంపేట్ దర్గా ప్రహరీ నిర్మాణ పనులను గురువారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దర్గా నిర్వాహకులతో కలిసి దర్గాను అభివృద్ధి పరచడానికి కావాల్సిన పనులను అడిగి తెలుసుకున్నారు. అత్యంత పురాతనమైన ఈ దర్గాకు ప్రతిరోజూ ఎందరో భక్తులు వస్తారన్నారు. దర్గా ఉర్సు ఉత్సవాలను భారీ ఎత్తున్న ప్రతి యేటా నిర్వహించడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం, వక్ఫ్‌బోర్డు ద్వారా దర్గా అభివృద్ధికి నిధులు తెస్తున్నానని ఆయన అన్నారు. దర్గా స్థలాలను కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దర్గాలో భక్తులకు అన్ని వసతులతో గదులు నిర్మిస్తామని తెలిపారు. ఆయన వెంట నాయకులు అలీమ్ ఉద్దీన్ తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఇన్‌స్పెక్టర్ల సమావేశంలో పాల్గొన్న చీఫ్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ దుర్గా ప్రసాద్

చార్మినార్: ఈనెల 11న నిర్వహించనున్న లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేటట్లు సంబంధిత పోలీస్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ చీఫ్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ దుర్గా ప్రసాద్ కోరారు. ఈ మేరకు చార్మినార్, హుస్సేనీఆలం, కామాటిపురా, చాంద్రాయణగుట్ట, ఛత్రినాక తదితర పోలీస్‌స్టేషన్లకు చెందిన ఇన్‌స్పెక్టర్లతో పాటు చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. రాజీ మార్గమే.. రాజా మార్గం అనే సూత్రంపై లోక్ అదాలత్ కార్యక్రమం కొనసాగుతుందని.. కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ కక్షిదారులు అభీష్టం మేరకు పరిష్కరించడానికి ఈ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన సమావేశానికి హాజరైన ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ సుధాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలను అరికట్టాలి



హెచ్ఎండీఏ చెరువు కట్టపై ఇటుక, ఇసుక అమ్మకాలు

గోల్కొండ: కబ్జాదారులు రోడ్లనే కాకుండా కొంత కాలంగా చెరువు కట్టలు, చెరువు ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌లను సైతం కబ్జా చేస్తున్నారు. చెరువు ఫుట్‌పాత్ కబ్జాలను అధికారులు చూసి చూడనట్లు ఉంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గోల్కొండ నయాఖిలా కందకానికి ఆనుకుని ఉన్న శాతం చెరువు కట్ట కొంత కాలంగా యథేచ్ఛగా చెత్త డంపింగ్ అవుతుంది. అదే విధంగా షేక్‌పేట్ డివిజన్‌లోని కొత్త చెరువు ఫుట్‌పాత్‌పై కూడా డబ్బాలు వెలిశాయి. ఇలాగుండగా అహ్మద్ కాలనీని ఆనుకుని ఉన్న హెచ్ఎండీఏ చెరువు ఫుట్‌పాత్ కూడా పూర్తిగా కబ్జాదారుల చేతుల్లోకి పోయింది. గోల్కొండ చోటాబజార్ నుంచి ఫతే దర్వాజ గుండా లంగర్‌హౌస్ వెళ్లే దారిలో ప్రధాన రహదారిని ఆనుకుని హెచ్ఎండీఏ చెరువు ఉంది. చెరువుకు ఆనుకుని పార్కు కూడా ఉంది. ప్రతినిత్యం ఈ పార్కుకు వేలాది మంది వస్తుంటారు. అంతేకాకుండా రోడ్డుకు ఆనుకుని ఉన్న చెరువు, ఫుట్‌పాత్‌పై మార్నింగ్ వాకర్స్ ఉదయం వస్తుంటారు. అయితే ఈ కట్ట ఫుట్‌పాత్‌పై ఇటుక, ఇసుక వ్యాపారులు ఏకంగా ఇటుకలను ఫుట్‌పాత్‌పై పేర్చి అమ్ముతున్నారు. అధికారులు వెంటనే ఫుట్‌పాత్‌ను కబ్జాకాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కృష్ణ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురకుల కృష్ణ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్ ఠాకూర్ వస్తున్న దృష్ట్యా గురువారం ఆయన కార్వాన్‌లో కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో యాత్రకు దేశం నలుమూలల నుంచి భారీ స్పందన వచ్చిందన్నారు. ఈ యాత్ర విజయవంతం కావడం ప్రజల్లో కాంగ్రెస్‌కు ఉన్న పట్టు స్పష్టం చేసిందని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఏమాత్రం బలం లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ప్రజల అభిమానం కోల్పోయిందని ఆయన అన్నారు. నాయకులు రవీందర్, మహిపాల్‌రెడ్డి, హమీద్ ఖాన్ తదితరులున్నారు.

సంప్రదాయ కళలను కాపాడుకుందాం



రేఖను సన్మానిస్తున్న కేవీ.రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ కళల పునర్‌వైభవానికి కృషి చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.వేణుగోపాల చారి అన్నారు. గురువారం రవీంద్రభారతిలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి 71వ జన్మదినం సందర్భంగా హరికథ మహోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.రేఖ పార్వతి కల్యాణం అనే అంశంపై హరిక గానం చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి, ప్రముఖ సాహితీ వేత్త వెంకట్, కిన్నెర సంస్థ కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.